క్లుప్తంగా

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: రాష్ట్రస్థాయి అండర్– 17 రెజ్లింగ్ పోటీల్లో దెందులూరు మండలం పోతునూరు, దోసపాడు విద్యార్థినులు ప్రతిభను కనబరిచి పతకాలు సాధించడం సంతోషదాయకమని రెజ్లింగ్ పోటీల రాష్ట్ర అబ్జర్వర్ సీహెచ్ రమేష్ అన్నారు. చిత్తూరులో నిర్వహించిన అండర్ – 17 బాలికల రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో బాలికల విభాగంలో దోసపాడుకి చెందిన సీహెచ్ జెస్సికా సిల్వర్ మెడల్, ఎస్ సులోచన బ్రాంజ్ మెడల్, పోతునూరుకి చెందిన డీ లాస్య సిల్వర్ మెడల్, వట్లూరు గ్రామానికి చెందిన రాధిక బ్రాంజ్ మెడల్స్ సాధించారు. విజేతలను జిల్లా టీం కోచ్ పోతునూరు ఫిజికల్ డైరెక్టర్ ఎం కృష్ణారావు, జిల్లా టీం మేనేజర్ మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎల్‌వీడీ రవి బాబు బాలికల టీమ్ మేనేజర్ వట్లూరు గురుకుల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శుక్రవారం అభినందించారు.

పోస్టాఫీసు పథకాలపై అవగాహన సదస్సు

దెందులూరు: అన్ని గ్రామాల్లో పోస్టాఫీసుల్లో పోస్టల్ శాఖ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు లబ్ధిని నేరుగా అందించేందుకు ఎన్‌పీసీఐ చేయూతనిస్తుందని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మండలంలో అన్ని పోస్టాఫీసులో పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు మైక్ ప్రచారకుడు మద్దభూషణంతో విస్తృత ప్రచారం చేయిస్తున్నారు. ప్రతి వ్యక్తి పోస్టాఫీసులో కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు పోస్టాఫీస్‌లకు వెళ్లి సంప్రదించాలని మైకు ద్వారా గ్రామ శివారు ప్రాంతాల్లో మద్దభూషణం ప్రచారం నిర్వహిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గణపవరం : ప్రజలకు సీజనల్ వ్యాధులపై పూర్తి అవగాహన కల్పించే బాధ్యత వైద్య ఆరోగ్య సిబ్బందిపై ఉందని ఆ దిశగా గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చాలని జిల్లా మలేరియా అధికారి గులాబ్ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీలో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను, అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని ముప్పర్తిపాడులో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో వైద్యాధికారిణి కె.ప్రియాంక, సిహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



వెంకటేశ్వరరావుకు రూ.2 లక్షల బీమా చెక్కును అందిస్తున్న మేనేజర్ శ్రీనివాసబాబు

నిడమర్రు : కేంద్రం బ్యాంకుల ద్వారా అందిస్తున్న బీమా పథకాలను ఖాతాదారులందరూ వినియోగించుకోవాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నిడమర్రు శాఖ మేనేజర్ రాపాక శ్రీనివాసబాబు కోరారు. శుక్రవారం గుణపర్రులో ఆ బ్యాంక్ ఆధ్వర్యంలో జనసురక్ష బీమా పథకాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం జీవన్ జ్యోతి, పీఎం సురక్ష బీమా యోజన పథకాలను ఖాతాదారులకు వివరించారు. ఈ సందర్భంగా గతంలో ఈ బీమా పథకాల్లో ప్రీమియం చెల్లించిన ముందలపర్రుకి చెందిన దొడ్డాకుల వెంకటలక్ష్మి ఇటీవల మరణించారు. ఆమెకు రావాల్సిన రూ.2 లక్షల బీమా సొమ్మును బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసబాబు నామినీగా ఉన్న ఆమె భర్త వెంకటేశ్వరరావుకు నగదు చెక్కుగా అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది టి. శ్రీలత, వి. ప్రశాంత్ కే. నారాయణ కరస్పాండెంట్ పి. పావని, సీఏ కృష్ణవేణి తదితరులున్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఉంగుటూరు: కైకరం సెంటర్లో ఏలూరు వైపు మార్గంలో శుక్రవారం చేబ్రోలు నుంచి పల్లపూరు వెళుతున్న వృద్ధుడిని (80) ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాలైన వృద్ధుడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడు నాలుగు రోజుల నుంచి కైకరం సెంటర్లో సంచరిస్తున్నాడు. అయితే ఇతని వివరాలు తెలియరాలేదు. ఆటోను చేబ్రోలు పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లినట్టు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

హైందవ శంఖారావంపై విస్తృత ప్రచారం

దెందులూరు: జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని దెందులూరు మండలం రామదండు నాయకులు సుబ్బిసెట్టి నూకరాజు కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం దెందులూరుతో పాటు వివిధ గ్రామాల్లో రామదండు కమిటీ ప్రచారం నిర్వహించారు. ఈనెల 16న పెదవేగి మండలం వంగూరులో సన్నాహక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

హడలెత్తిస్తున్న 'దెయ్యం చేప'

- ఆక్వా రంగానికి తిండిపోతు చేపలతో తీవ్ర నష్టం
- రైతుల పాలిట శాపంగా మారిన మత్స్యం
- చెరువుల్లో మేత వేస్తే క్షణాల్లో మింగేస్తున్న డెవిల్ ఫిష్
- తగ్గుతున్న చేపల దిగుబడి



చేపల పట్టుబడిలో వలకు చిక్కిన దెయ్యం చేపలు

గణపవరం : చూడ్డానికి వింత ఆకారంలో ముళ్లతో కూడిన దెయ్యం చేప (డెవిల్ ఫిష్), లేదా విమానం చేపను చెరువుల్లో చేస్తే ఆక్వా రైతులు హడలిపోతున్నారు. దీన్ని సక్కర్ మౌత్ క్యాట్ ఫిష్ అంటారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆక్వా రైతుల పాలిట దెయ్యం చేపలు శాపంగా పరిణమించాయి. ప్రతి చెరువులో ఇవి వేల సంఖ్యలో వృద్ధి చెంది చేపలకు అందాల్సిన మేత తింటూ ఆక్వా రైతులను నిలువునా ముంచుతున్నాయి. వీటి బెడద ఎలా వదిలించుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఐదారేళ్లుగా వీటి బెడద మరీ ఎక్కువ అయిందని రైతులు వాపోతున్నారు. చేపలకు వేసే మేతల్లో సగానికి పైగా ఇవే ఆరగిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఎక్కడి నుంచి పుట్టుకొచ్చాయో తెలియదు కాని వీటి సంతతి మాత్రం చెరువుల్లో ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. వీటిబెడద కారణంగా రైతులకు ఎకరాకు రూ.20 నుంచి రూ.30 వేల వరకూ మేతలకు అదనంగా ఖర్చవుతుందని వాపోతున్నారు.

దెయ్యం చేపలతో తగ్గుతున్న ఆదాయం

ముళ్లతో నిండి శరీరం అంతటా తెల్లని, నల్లని మచ్చలతో చూడటానికి భయంగొలిపే విధంగా చేపలు ఉంటాయి. అందువల్లనే వీటిని దెయ్యం చేపలు అంటారు. వీటికి తోడు చైనా గురకల వల్ల కూడా ఆక్వా రైతులు నష్టాల పాలవుతున్నారు. చెరువుల్లో ఇవి కూడా లెక్కకుమించి ఉంటున్నాయి. చేపలకు వేసే మేతలను ఇవి సగానికిపైగా తింటూ రోజురోజుకూ వృద్ధి చెందుతున్నాయి. దెయ్యం చేపల శరీరంపై ముళ్లు ఉండటం వల్ల మామూలు చేపలు వీటిని అడ్డుకునే పరిస్థితిలేక అవి మేతలను దర్జాగా ఆరగిస్తుంటాయి. దీని వల్ల చెరువులో చేపలు ఎదుగుదల లేక సకాలంలో పట్టుబడికి రావడం లేదు.

మందులతో ఫలితం శూన్యం

చెరువుల్లో వీటి నిర్మూలనకు మందులు వాడినా, ఆ మందుల ప్రభావం ఇతర మామూలు చేపలకు చేరే ప్రమాదం ఉంటుంది.అందువల్ల రైతులు మందులు వాడకుండా వలలతో పట్టి వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా ఆశించిన ఫలితం మాత్రం రావడంలేదు. ఇవి వలలకు కూడా చిక్కకుండా పెద్ద చేపలతోపాటు తప్పించుకుంటున్నాయి. ఇవి వాటి కంటే చిన్న చేపలను తినేస్తాయి. కొన్ని రోజులు చెరువులో నీరు లేకున్నా బురదలోకి చొచ్చుకుపోయి బతకగలదు. పెద్ద దెయ్యం చేపలకు ఉన్న ముళ్లతో గట్లను తొలిచి పక్క చెరువులోకి వెళ్లి అక్కడ వృద్ధి చెందుతాయి. చేపల పట్టుబడి సమయంలో మనుషులను కూడా ఇది గాయపరుస్తుంది. దీనితో గత్యంతరంలేక రైతులు చెరువుల్లో అదనంగా మేతలు వినియోగించాల్సి వస్తోంది.

ఇవి చెరువుల్లోకి ఎలా వస్తున్నాయి

దెయ్యం చేపలు చెరువుల్లోకి ఎలా వస్తున్నాయన్న అంశంపై మత్స్యశాఖ అధికారులు రెండు కారణాలు చెబుతున్నారు. హేచరీల నుంచి చేప పిల్లలను పరిశీలించకుండా తెచ్చి చెరువుల్లో వేయడం ద్వారా ఇవి ప్రవేశిస్తున్నాయి. వీటి గుడ్లపై పెంకు చాలా గట్టిగా ఉంటుంది. అందువల్ల రైతులు చేపలు పట్టివేసిన తర్వాత చెరువు ఎండగట్టి, రసాయనాలు చల్లినా దెయ్యం చేప గుడ్లను ఏమీ చేయలేవు. రోజుల తరబడి చెరువుల్లో వీటి గుడ్లు బురదలో ఉండగలవు. దీనితో చెరువులో కొత్తనీరు నింపి, పిల్లలను వేయగానే ఈ గుడ్లు వృద్ధి చెంది చెరువుల్లో వృద్ధి చెందుతున్నాయి.

ఇదీ పరిష్కారం

సాగు ప్రారంభించే ముందు చెరువులో మట్టిని కనీసం రెండు అడుగుల మేర తొలగించి దూరంగా పారబోయాలి. చెరువులో చేప పిల్లలను వదిలే సమయంలో వాటితో పాటు ఎకరాకు 50 వరకూ సీతల్ చేప పిల్లలను కూడా వదలాలి. ఇవి చెరువులో కలియ తిరుగుతూ దెయ్యం చేపలు, గురకల పిల్లలను, వాటి గుడ్లను తినేస్తాయి. సీతల్ చేపలు మాంసాహారులే కాని వాటికన్నా పెద్దసైజు ఉండే మామూలు చేప పిల్లల జోలికి వెళ్లవు.

> **దెయ్యం చేపల బెడద ఎక్కువైంది**
>
> కొన్నేళ్లుగా ఆక్వా రైతులకు దెయ్యం చేపల బెడద ఎక్కువైంది. వీటికితోడు చైనా గురకల బెడద కూడా ఎక్కువైంది. వీటివల్ల రైతులకు మేతల వ్యయం భారంగా మారింది. దీనికి ప్రభుత్వం, మత్స్యశాఖ నిపుణులు తగిన పరిష్కారం చూపించి రైతులను ఆదుకోవాలి.
>
> – కాకర్ల వినాయకం, జిల్లా ఆక్వా రైతు సంఘ నాయకుడు

షష్ఠి మహోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



ఉంగుటూరు: కై కరం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు డిసెంబర్ 7 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. శుక్రవారం మహోత్సవాల గోడపత్రికను ఎమ్మెల్యే పత్సమత్స ధర్మరాజు చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శ్రీనివాస్, కై కరం సర్పంచ్ సలగాల గోపి, నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివక్షేత్ర దర్శనానికి మోటార్‌సైకిల్ యాత్ర

దెందులూరు: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని రామదండు ఆధ్వర్యంలో శివక్షేత్ర దర్శన మోటార్ సైకిల్ యాత్ర ఉదయం 6 గంటలకు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా దెందులూరు శివాలయంలో యాత్రికులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మొటపర్తి రాజా జెండా ఊపి బైక్ యాత్రను ప్రారంభించారు. యాత్రికులు శివనామ స్మరణతో గ్రామంలో ర్యాలీ అనంతరం జోగన్నపాలెం, శ్రీరామవరం, చల్ల చింతలపూడి, పంగిడిగూడెం, ద్వారకాతిరుమల ఆరు శివ క్షేత్ర దర్శనం చేసుకున్నారు. అయ్యప్ప, భవానీ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు

ఉంగుటూరు: కార్తీక మాసంలో వచ్చే పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీనితో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉంగుటూరులో శుక్రవారం పార్వతీ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కోలాహలంగా కనిపించింది.ఆలయ ఈవో కలగర శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎస్ హనుమంతురావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. నాచుగుంట, చింతాయిగూడెం, బాదంపూడి, బొమ్మిడి, రాచూరు, నారాయణపురం, ఉంగుటూరు, చేబ్రోలు, కైకరం, కంసాలిగుంట, గొల్లగూడెం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో అభిషేకాలు, పూజలు

దెందులూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం దెందులూరు, చల్లచింతలపూడి, కొవ్వలి, పోతునూరు, శ్రీరామవరం, జోగన్నపాలెం ఆలయాలతో పాటు గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆవరణలోని భీమేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు దీపాలంకరణ, జమ్మి చెట్టు వద్ద పూజలు చేశారు. ఆలయ వెలుపల మహిళలు శివలింగాకారంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు.

శివాలయంలో పూజలు

పెదపాడు : పెదపాడులోని గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో జిల్లా పంచాయతీ అధికారి అనూరాధ ప్రత్యేక పూజలు చేసారు. పెదపాడు మండలంలోని జీపీడీపీ శిక్షణ తరగులను పరిశీలించేందుకు వచ్చిన అనూరాధ కార్తీక పౌర్ణమి కావడంతో శివునికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆమెతో పాటు డివిజనల్ పంచాయతీ అధికారి సూర్యకుమార్ ఈఓ మేకా శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

భీమడోలు : భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి, గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి, పోలసానిపల్లిలోనిపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, పూళ్లలోని సకలేశ్వర భీమేశ్వర స్వామి, అంబర్‌పేటలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో శుక్రవారం కిటకిటలాడాయి. గుండుగొలను శివాలయంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.



భీమడోలు : ఆకట్టుకున్న స్ఫటిక లింగ దర్శనం



భీమడోలు : భీమేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ



నిడమర్రు : పంచాయతన క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా హారతులు ఇస్తున్న దృశ్యం



పిప్పర శివాలయంలో శివలింగాకారంలో దీపారాధన చేస్తున్న మహిళలు



గాలాయగూడెం భీమేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం

భక్తులకు స్ఫటిక లింగం దర్శనం చేసుకుని తరించారు. భీమడోలు, పోలసానిపల్లి శివాలయాల్లో స్వామివారికి క్షీరాభిషేకాలు, పూజలు చేసారు.

ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

నిడమర్రు : కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు ఉపవాసాలతో గడిపి ఇంటి వద్ద శ్రీ కేదారేశ్వరి నోములు నోచుకుని ఆలయాల్లో దీపారాధనలు, దానాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మందలపర్రు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి హారతిని కాశీ నుంచి వచ్చిన పండితులు అందించారు. ఆలయంలో నిర్వహించిన దీపోత్సంవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వద్ద అన్న సమారాధనలో 5వేల మందికి పైగా భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

గణపవరం : పిప్పర శివాలయంలో శుక్రవారం కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. గణపవరం సువర్ణేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త ఆర్‌వీఎస్‌రాజు దేవీస్తోత్రం పుస్తకాన్ని భక్తులకు పంచారు. శివలింగాకారంలో దీపాలు వెలిగించారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు సహకరించాలి



భీమడోలులో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, భీమడోలు ఎస్సైలు

భీమడోలు: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని భీమడోలు సర్కిల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ బి.సత్యనారాయణ అన్నారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం కళాశాల యువకులు, విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన సదస్సు, కెరీయర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. భీమడోలు లా అండ్ ఆర్డర్ ఎస్సై వై.సుధాకర్, ఎక్సైజ్ ఎస్సై రామస్వామితో కలిసి ఆయన కళాశాల, పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, బంగారు భవిష్యత్తును ఏ విధంగా నాశనం చేస్తాయో వారికి వివరించారు. సీఐ బి.సత్యనారాయణ మాట్లాడుతూ యువత డ్రగ్స్ ఉచ్చులో పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. అనంతరం కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు సాయంత్రం పరుగుపందెం, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మారావు, అధ్యాపకులు పి.బాలు, శశికాంత్, ఎక్సైజ్ శాఖ మహిళా కానిస్టేబుల్స్, విద్యార్థులు పాల్గొన్నారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వైద్యురాలు అరుణజ్యోతి ప్రారంభించారు. ప్రకృతి వైపరీత్యాలపై చిన్నారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుని అభినందించారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. టీచర్లు ఆనందబాబు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం ద్వారానే జ్ఞాన సముపార్జన

గణపవరం : సాంకేతికత ఎంత పెరిగినా పుస్తక పఠనం ద్వారా వచ్చే జ్ఞానం జీవితాంతం మదిలో నిలిచిపోతుందని పిప్పర ఎస్‌బీఐ మేనేజరు ప్రవీణ్ కుమార్, యూనియన్ బ్యాంకు మేనేజరు దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు గుడ్ల కృష్ణారావు ప్రారంభించారు. గణపవరం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పీహెచ్‌సీ సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ప్రముఖ చిత్రకారుడు రాజు బత్తుల, ఐఎస్‌రాజు, గ్రంథపాలకులు పాల్గొన్నారు.



గణపవరం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న చిన్నారులు

పుస్తక ప్రదర్శన

పెదపాడు: విద్యార్థులు గ్రంథ పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని విద్యుత్ శాఖ ఏఈ వై రాంబాబు తెలిపారు. పెదపాడులోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథపాలకుడు డీ జాన్‌బాబు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన

ఉంగుటూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. మండల పశువైద్యాధికారి శిరీష ఈ ప్రదర్శనను ప్రారంభించారు.ఉపాధ్యాయుడు శివయ్య, లైబ్రేరియన్ సీహెచ్ గంగాధరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

దెందులూరు : పుస్తకం, వార్త పత్రికల పఠనంతో విజ్ఞానం వృద్ధి చెందుతుందని దెందులూరు గ్రంథాలయ అధికారిని ఝాన్సీ అన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దెందులూరు గ్రంథాలయంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయ వారోత్సవాలు చరిత్రపై విద్యార్థులకు సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. పోతునూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రాంబాబు విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని రాంబాబు అన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

భీమడోలు: పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో రెండో రోజైన శుక్రవారం నిర్వహించిన జోన్ 2 బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు ఉల్లాసభరితమైన వాతావరణంలో హోరాహోరీగా సాగాయి. జోన్ పరిధిలోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణా జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 29 కళాశాలలకు చెందిన 1,050 మంది బాలికలు వివిధ క్రీడా పోటీల్లో తమ సత్తా చాటారు. పోటీలకు హాజరైన బాలికలు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులున్నందున వారంతా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను చాటారు. పలు అంశాల్లో ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. కబడ్డీ, ఖోఖో, హ్యాండ్ బాల్, చెస్, తదితర పోటీలు సెమీఫైనల్స్ నిర్వహించారు. జోన్ స్పోర్ట్స్ మీట్ కోఆర్డినేటర్ శ్యామల, జిల్లా కోఆర్డినేటర్ ఎన్.భారతి, ప్రిన్సిపల్ వీవీ రమణ విజేతలను ప్రకటించారు. పాఠశాల విభాగంలో 1,500 మీటర్ల పరుగు పందెంలో వి.ఇందు (ప్రథమం, జంగారెడ్డిగూడెం), జి.నిత్యశ్రీ (ద్వితీయ స్థానం, పోలసానిపల్లి), పి.పూజ(తృతీయ స్థానం, జంగారెడ్డిగూడెం), షాట్‌పుట్ విభాగంలో పాఠశాల స్థాయిలో పి.కీర్తన (ప్రథమం, ముప్పళ్ల), పి.కృష్ణవేణి (ద్వితీయ, కొవ్వూరు), డి.శ్రీలత(తృతీయ, ముప్పళ్ల), కళాశాల విభాగంలో కె.లావణ్య (ప్రథమ, తుని), వి.నిఖిత (ద్వితీయ, ముప్పళ్ల), కె.రమ్య (తృతీయ, కుంటముక్కల) విజేతలుగా నిలిచారు. డిస్కస్ త్రో పోటీల్లో కె.లావణ్య (ప్రథమ, తుని), కె.నిధి (ద్వితీయ, కుంటముక్కల), వి.నిఖిత (తృతీయ, ముప్పళ్ల) విజేతలుగా నిలిచారు. ఈనెల 17న జోనల్ పోటీలు ముగుస్తాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ సాయి లక్ష్మి, వట్లూరు ప్రిన్సిపల్ ఝాన్సీ, 60 మంది పీడీ, పీఈటీలు, హెల్త్ సూపర్‌వైజర్ ఎంవీబీ లక్ష్మీ పోటీలను పర్యవేక్షించారు.



పోలసానిపల్లిలో విజేతలకు పతకాలు అందిస్తున్న డీసీవో ఎన్.భారతి, ప్రిన్సిపల్ వీవీ రమణ

అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటాలి

దెందులూరు: ప్రభుత్వ సొంత స్థలం కలిగిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక ఉత్పత్తులు అందించే మొక్కలు నాటి వాటిని అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది దత్తత తీసుకుని సంరక్షించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పెదపాడు ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ) విజయలక్ష్మి, అసిస్టెంట్ సీడీపీఓ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం దెందులూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో కోడ్ నంబర్ 112, 116, 185 సంబంధించి కామన్ సైట్ ఏర్పాటు చేసుకుని మొక్కలు పెంచుతున్న అంగన్‌వాడీ టీచర్లు బి రంగమ్మ, కె ధనలక్ష్మి, కె.సుజాతతో పాటు అదే దెందులూరులో అంగన్‌వాడీ కోడ్ నంబర్ 110, 111, 108 కోడ్ సెంటర్లలో పరిధిలో మొక్కల పెంపకానికి కేటాయించిన స్థలాన్ని వారు పరిశీలించారు.

మహిళలకు రక్షణగా చట్టాలు

పెదపాడు: మహిళలు ఆపద సమయంలో 181కు కాల్ చేసి రక్షణ పొందవచ్చని పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కే విజయలక్ష్మి తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరులో మిషన్ శక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మహిళా చట్టాలను, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను విజయలక్ష్మి వివరించారు. బాల్య వివాహాల చేసిన వారికి అమలు చేసే శిక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేస్ వర్కర్ పి.తిరుపతమ్మ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

భీమడోలు: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఏలూరు జిల్లా డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. కొల్లేరు గ్రామం ఆగడాలలంకలో శుక్రవారం నూతన చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మహిళలకు రక్షణ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల లింకులు, మేసెజ్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. బ్యాంకింగ్, వ్యక్తిగత సమాచారాన్ని తస్కరణకు అవకాశం ఇవ్వవద్దన్నారు. గ్రామస్తులు అపదలో ఉన్నప్పుడు 112 నంబర్‌కు కాల్ చేయాలని లేదా వాట్సాప్ సందేశాన్ని అందిస్తే 10 నిమిషాల్లో పోలీసులు స్పందిస్తారన్నారు. ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేస్తే చట్ట ప్రకారం శిక్ష తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన సర్వేతో రైతులకు మేలైన పథకాలు

భీమడోలు: భారత పశుగణన ద్వారా పాడి రైతులు మేలైన పథకాలు అమలు అవుతాయని, రైతులు ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు అన్నారు. మండలంలోని భీమడోలు, పోలసానిపల్లి, అర్జావారిగూడెం, వడ్డిగూడెం, లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడులో చేపట్టిన అఖిల భారత పశు గణన సర్వే అమలు తీరును పశువైద్యాధికారి హరికృష్ణతో శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పశు సంవర్ధక శాఖ సిబ్బంది పశువుల సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించి వారికి పలు సూచనలందించారు. ప్రతి ఐదేళ్ల కొకసారి పశుగణన సర్వే జరుగుతుందని అన్నారు. 16 జాతుల జంతువుల వివరాలను సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీ సాయి రమేష్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.